క్లుప్తంగా

79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూ రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం 79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. గ్రామవీధుల్లో జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టి భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడానికి 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 79 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించామని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని వసంత లక్ష్మి తెలిపారు. ఈ ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, అమర్‌నాథ్, జ్ఞాన దీపం, జయ మణి, శంకర్ నాయక్, మునీర్, కాళప్ప, రమా దేవి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


దేవతా విగ్రహాలకు ప్రత్యే పూజలు

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లె పంచాయతీ మఠంపల్లెలో వెలసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో గురువారం శ్రీసుబ్రమణ్యస్వామి, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతిష్టాపన పూజల్లో మొదటి రోజు 13వ తేదీ అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండో రోజు మండపారాధన, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాల దాత సిద్దయ్యశెట్టి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీసుబ్రమణ్యస్వామి, నాగదేవతల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం నూతన విగ్రహాలకు మంగళ హారతి సమర్పించి, హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

16న ఆడికృత్తిక, అష్టమి పూజలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడికృత్తిక, అష్టమి పూజలను ఈ నెల 16న చిత్తూరులోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు శివ కుమార్, కాలభైరవ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్‌న్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కృత్తిక, అష్టమి నక్షత్రాలు ఒకే రోజున రావడం దైవలీల అన్నారు. ఆ రోజున వేద పండితుల ఆధ్వర్యంలోలో ఉదయం నుంచి రాత్రి వరకు హోమాది క్రతువులు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి కాలభైరవుడికి అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సామర్థ్యాలను మెరుగు పరచాలి

తవణంపల్లె: విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగు పరచాలని తవణంపల్లె ఎంఈఓ హేమలత ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎగువ వెంకటాపురం పాఠశాలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, వివిధ రికార్డులను పరిశీలించారు. పాఠశాలలోని అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అంతదించాలని ఆదేశించారు. విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష అసెస్మెంట్ బుక్సలను తరగతుల వారీగా పరిశీలించారు. స్కూల్ హెచ్ఎం చాముండేశ్వరి, సీఆర్‌పీ చిట్టిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి 'అంగీకారం'


అధికారులకు అంగీకార పత్రం ఇస్తున్న భవన యజమానులు

చిత్తూరు అర్బన్ : నగరంలోని హైరోడ్డు విస్తరణకు తమ భవనం కోల్పోయినా పర్లేదని యజమానులు దామోదర నాయుడు, జ్ఞాన ప్రకాష్ వెల్లడించారు. గురువారం అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్రను కలిసి ఈ మేరకు అంగీకార పత్రాలు అందచేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపరిహారానికి బదులుగా, టీడీఆర్ బాండ్లు ఇచ్చినా అభ్యంతరం లేదని తెలిపారు. చిత్తూరు నగరాభివృద్ధికి అడ్డుగా ఉండమని, తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

మట్టి ప్రతిమలే మేలు

వినాయక చవితి వేడుకలకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పలు ప్రాంతాల్లో మండపాల నిర్మాణానికి నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. పోటా పోటీగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో మట్టి ప్రతిమలకే ప్రాధాన్యమివ్వాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లో తయారు చేసిన బొమ్మతో ప్రకృతి వనరులకు ముప్పు వాటిల్లుతుందని వెల్లడిస్తున్నారు.

- వినాయక చవితి వేడుకలకు సన్నాహాలు
- ఊపందుకున్న విగ్రహాల తయారీ, విక్రయాలు
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మలు వద్దంటున్న పర్యావరణ వేత్తలు


గుడిపాల: మట్టి వినాయక విగ్రహాల తయారు చేస్తున్న దృశ్యం

గుడిపాల: వినాయక చవితి ఉత్సవాలకు సమయం సమీపిస్తోంది. మండపం, విగ్రహాల ఏర్పాటు, పూజల వరకు ఇలా ప్రతి దానిలో తమదే పైచేయి కావాలనే రీతిలో నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులు మట్టి వినాయక ప్రతిమలను వాడి, పర్యావరణానికి మేలు జరిగేలా చూడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. ఈ నెల 27వ తేదీన ప్రారంభమయ్యే ఈ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రధానంగా యువత పోటీ పడుతుంటారు. ఎవరెంత ఎత్తు విగ్రహం పెట్టి, ఎక్కువ రోజుల పాటు ఉత్సవం చేస్తారో వారే గొప్ప అనుకునేలా ఈ పండుగ జరుపుకోవడానికి ఉవ్విళ్లూరుతుంటారు. ఈ క్రమంలో మట్టి వినాయక విగ్రహాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ప్రచారాలు తక్కువయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా అవగాహన కల్పించినా కొంతమంది మట్టి విగ్రహాలను కాదని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మలకే మొగ్గు చూపిస్తుండడం గమనార్హం.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో సమస్యలిలా...

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో తయారు చేసిన విగ్రహాలు వినియోగిస్తే తలెత్తే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్ నుంచి పీఓపీని తయారుచేస్తారు. ఇది నీటిలో కరిగితే కాలుష్యం ఏర్పడి జీవరాశులు చనిపోతాయి. నీటి సహజ గుణం దెబ్బతింటుంది. విగ్రహాల తయారీకి పీఓపీతో పాటు వీటికి వాడే రంగుల్లో పాదరసం, సీసం, క్రోమియం వంటి లోహాలను కలుపుతారు. ఇలాంటి విగ్రహాలు నీటిలోనే కాదు నేలలోకి చేరి అనేక రకాల వ్యాధులకు కారణమవుతున్నాయి. గాలి, నీరు, భూమి కాలుష్యానికి కారణమవుతున్నాయి.

అవగాహన చర్యలేవి ?

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 27వ తేదీన ఆరంభం కానున్నా ఎక్కడా అవగాహన చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. విగ్రహాల తయారీ దగ్గర నుంచే ఈ చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడంలో ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టి విగ్రహాల వాడకంపై అవగాహన కల్పించకపోవడంతోనే పీఓపీ విగ్రహాల తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం విగ్రహాల కొనుగోలు మొదలైందని, ఇప్పుడు తూతూమంత్రంగా అవగాహన కల్పిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. సరిగ్గా పండగకు రెండు, మూడు రోజుల ముందు మట్టి విగ్రహాలు వాడాలని అవగాహన కల్పిస్తే సరికాదని, విగ్రహాల తయారీ దగ్గర నుంచే ప్రచారం మొదలుపెడితే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు.

మట్టితో మేలిదే..

మట్టితో తయారుచేసిన విగ్రహాలను వాడితే పర్యావరణానికి చాలా మంచిది. నిమజ్జనం సమయంలో నీరు కలుషితం కాదు. అందులో జీవులకు ఎటువంటి హాని ఉండదు. సులభంగా నీటిలో కరిగిపోతుంది. నేలకు కూడా ఎటువంటి నష్టం ఉండదని పర్యావరణ వేత్తలు సలహా ఇస్తున్నారు.

పర్యావరణానికి మేలు


మట్టి విగ్రహాలే మంచివి. ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన ప్రతిమలే గణపతి ఉత్సవాల్లో వినియోగించాలి. అవే పర్యావరణానికి మేలు చేస్తాయి. మట్టి పరమ పవిత్రం.

\- మహేష్, వేదపండితుడు

రేపు వజ్రాలపురంలో ఆడికృత్తిక వేడుకలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండపై వెలసిన శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం భక్తులు కావడి మొక్కులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందన్నారు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవళ్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపటి నుంచి శ్రీకృష్ణ జయంతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చర్చివీధిలోని శ్రీకృష్ణ విలాస సభలో శనివారం నుంచి శ్రీకృష్ణజయంతి మహోత్సవం ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 16న గోకులాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 17న శ్రీకృష్ణ జయంతి, మహాభిషేకం, 18న భజన కార్యక్రమం, 19న అన్నదాన కార్యక్రమం, 20న కల్యాణోత్సవం, 21న పుష్పయాగం, 22న సహస్ర దీపాలంకరణసేవ, 23న ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి

\- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అమరావతి


మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళెం: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా పనిచేదామని ఎంపీపీ అమరావతి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఆరు శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. వారు పూతలపట్టులో ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశానికి వెళ్లారని ఎంపీడీఓ తెలిపారు. సమావేశానికి హాజరైన అధికారులు వారికి సంబంధించిన అంశాలను గురించి తూతూ మంత్రంగా ప్రస్తావించి ముగించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి తక్షణం వాటిని పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేయాలన్నారు. బదిలీలపై కొత్తగా మండలానికి వచ్చిన అధికారులు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్య టించి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ హేమచంద్ర నాయుడు, ఎంపీడీఓ మహేష్, తహశీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఐరాల: విద్యార్థులు బాల్యం నుంచే ఏదైనా ఒక లక్ష్యాన్ని పెట్టుకొని, దానిని సాధించడానికి కృషి చేయాలని కాణిపాకం పట్నం కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రత్యూష అన్నారు. గురువారం కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ తరపున ఆ పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆర్థిక సాయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ క్రమశిక్షణతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వడానికి తమ బ్యాంకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం 5, 6, 7 తరగతిలో ప్రతిభ కనబరచిని నిహారిక, చరిష్మా, హేమశ్రీలకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతిలో త్రిషిక, వనిత, వైష్ణవిలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య ముఖ్యం



లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్టంట్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : నేటి సమాజంలో విలువలతో కూడిన విద్య చాలా ముఖ్యమని ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్స్ రామ్, లక్ష్మణ్‌లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ రోజ్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు కొరియోగ్రాఫర్స్ అతిథులుగా పాల్గొన్నారు. లిటిల్ రోజ్ పాఠశాల నిర్వాహకులు రూపొందించిన లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్లు విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి చేసే చిన్న చిన్న తప్పులను క్షమించి సరిదిద్దాలన్నారు. చిన్న వయస్సులో పాఠశాల డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న లోహిత్ కుమార్ లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లీగ్ ఆఫ్ యంగ్ హీరోస్ సూపర్ ఇండియా పుస్తకాలను అందజేశారు. అనంతరం కొరియోగ్రాఫర్స్ ను ఆ పాఠశాల బృందం సత్కరించింది. పాఠశాల అకడమిక్ ఇన్‌చార్జి దుర్గాశ్రీ, డైరెక్టర్స్ రాధిక, గోపాలకృష్ణమూర్తి, పవిత్ర, లోహిత్, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


బృందావన్ పాఠశాలలో వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మిట్టూరులో ర్యాంకర్స్, సంతపేటలో బందావన్ సీబీఎస్ఈ పాఠశాలల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ర్యాంకర్స్ పాఠశాలలో విద్యార్థులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు.కార్యక్రమంలోకరస్పాండెంట్ రమణారెడ్డి, డైరెక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే బృందావన్ సీబీఎస్ఈ పాఠశాలలో వేడుకగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.ప్రిన్సిపల్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజా మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగ విశిష్టతలను తెలియజేయడం చదువులో ఒక భాగమన్నారు.


ర్యాంకర్స్ స్కూల్‌లో ఆకట్టుకునేలా విద్యార్థుల వేషధారణ

నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తవణంపల్లె: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తామని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూజలు చేసి జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

సెప్టెంబర్ 13న విద్యుత్ ఓసీ ఉద్యోగుల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని సెప్టెంబర్ 13న నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, కార్యదర్శి చంద్రమౌళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

కాణిపాకం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ గురువారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో సుమారుగా 25 కంపెనీలు పాల్గొని 1200 మందిని ఉద్యోగాల్లో నియమిస్తారని ఆయన తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ చేసిన నిరుద్యోగ యువతీయువకులు పాల్గొనవచ్చని తెలిపారు. 20వ తారీఖు ఉదయం 9 గంటల నుండి తలుపులపల్లె, రంగంపేట క్రాస్ వద్ద ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ


ర్యాలీలో సైకిల్ రైడర్స్

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా ఒక మొక్క నాటాలని సైకిల్ రైడర్స్ అసోషియేషన్ సభ్యులు డాక్టర్ భరత్, జయంత్ కోరారు. గురువారం ఈ మేరకు నగరంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అకారణంగా చెట్లు నరకకూడదని సూచించారు. కార్యక్రమంలో సైకిల్ రైడర్స్ అసోషియేషన్ సభ్యులు జై, సూరి, వినోద్, మంజు, ఏలుమలై, మురళి, నీలేష్ పాల్గొన్నారు.

చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చిత్తూరు మార్కెటింగ్ శాఖ అధికారి ఇందుమతి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గురజాల జగన్‌మోహన్, చైర్మన్‌గా ఝాన్సీరాణి, వైస్ చైర్మన్‌గా అనురాధ, సభ్యులుగా రామమూర్తి, గంజినాయుడు, రాణి, నందిని, నాగరాజన్, జయపాలన్, సయ్యద్ ఫిరోజ్, హేమచంద్ర, అంజలి, మీనాక్షి, గౌరి, గోవిందస్వామి నాయుడు, మోహన్‌నాయుడులను నియమించిందన్నారు. ఉత్తర్వులు గురువారం కార్యాలయానికి అందాయన్నారు. త్వరలో కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఉపాధి బకాయిలు విడుదల

పూతలపట్టు(యాదమరి): 2014–19 మధ్య జాతీయ గ్రామీన ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలు విడుదలైనట్లు స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీరాజ్, వెలుగు, గృహ నిర్మాణ శాఖ, పశువైద్య శాఖలలో చేపట్టిన పనులకు సంబంధించి రూ.2.37 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. అన్ని మండలాల ఎంపీడీఓలు, శాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. సాయంత్రం అన్నదాత సుఖీభవ విజయోత్సవంలో భాగంగా రంగంపేట క్రాస్ నుంచి ఆర్‌వీఎస్ కాలేజీ వరకు రైతులు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

బదిలీ కోసం అధ్యాపకుల నిరసన


సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట నినాదాలు చేస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు బదిలీలు చేపట్టాలని జీసీటీఏ జిల్లా కార్యదర్శి తిరుకుమరన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట అధ్యాపకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ బదిలీలు నిర్వహించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్యదర్శి వినీల మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు బదిలీలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ అధ్యాపకుల బదిలీలు చేపట్టాలని కోరారు. అధ్యాపకులు ఉషారాణి, సంధ్యారాణి, షమ్సు అక్తర్, నాగరాజా పాల్గొన్నారు.